E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

సంపుటి - 04 | సంచిక- 171 | తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | 16-11-2026 | సోమవారం | పేజీలు : 08

రాహుల్ సభకు జనం కరువు



- రాహుల్ సభకు జనం కరువు.. మంత్రుల అసహనం
- జనసమీకరణ బాధ్యతలపై నేతల మధ్య అసంతృప్తి
- నగర ఎమ్మెల్యేలున్నా కనిపించని పార్టీ కేడర్
- ముందే చెబితే జనాలను తరలించేవాళ్లం
- జనం పలుచగా ఉండటంతో రాహుల్ ప్రసంగం కట్
- ఐదు లక్షల మందికి కార్యక్రమం.. తీరా నిరాశే!
- వాయిదాల మీద వాయిదాలు.. చివరకు వెలవెలబోయిన సభ
- వేదికపైకి వెళ్లకుండా మంత్రులకు అడ్డంకులు
- జాతీయ నేత సభలోనూ సమన్వయ లోపం బట్టబయలు

న్యూస్ డెస్క్, నవంబర్ 15(తెలుగు గళం) కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యే కార్యక్రమానికి ఇదేనా సమీకరణ అంటూ గిగ్ వర్కర్ల కార్యక్రమంపై మంత్రులు పెదవి విరిచారు. 'రాహుల్ కొద్ది సేపే ప్రసంగించారు ఏంటి సార్'.. అంటూ భారత్ సమ్మిట్ జరిగే హెచ్ఐసీసీ వద్ద ఒక దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రిని మీడియా ప్రతినిధులు అడుగగా.. 'రాహుల్ జనాలు, వారి మూడ్‌ను బట్టి మాట్లాడుతారు.. మేము ఆయనను చాలాసార్లు చూశాం.. తక్కువ సంఖ్యలో జనాలు ఉంటే మాట్లాడాటానికి అంతగా ఆసక్తి చూపరు. వారికి తగ్గట్లుగానే మాట్లాడుతారు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

స్టార్‌షిప్ ప్రయోగం పాక్షిక విజయం

- కక్ష్యలోకి 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలు
- సముద్రంలో పేలిపోయిన సూపర్ హెవీ బూస్టర్
- ల్యాండింగ్‌లో విఫలమైన స్పేస్‌ఎక్స్
- స్టార్‌షిప్‌ను పట్టుకునేందుకు భారీ ఏర్పాట్లు
- 2028 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములు
- ప్రయోగాల కోసం మళ్లీ వాడుకునేలా ప్లాన్
- బూస్టర్ వైఫల్యంతో లక్ష్యానికి ఆటంకాలు



న్యూస్ డెస్క్, నవంబర్ 15(తెలుగు గళం): టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ సంస్థ చేపట్టిన 'స్టార్‌షిప్' అంతరిక్ష ప్రయోగం పాక్షిక విజయాన్ని సాధించింది. శుక్రవారం సౌత్ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుండి నింగిలోకి దూసుకెళ్లిన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఈ 124 మీటర్ల రాకెట్, తన ప్రధాన లక్ష్యమైన స్టార్‌లింక్ నెట్‌వర్క్ కోసం 26 ఉపగ్రహాలను విజయవంతంగా భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అయితే, ప్రయోగం తర్వాత రాకెట్ కింది భాగమైన 'సూపర్ హెవీ బూస్టర్'ను తిరిగి లాంచ్ ప్యాడ్ వద్ద సురక్షితంగా పట్టుకోవాల్సిన లక్ష్యం విఫలమైంది. తిరుగు ప్రయాణంలో బూస్టర్ నిర్దేశిత మార్గం నుండి పక్కకు మళ్లి, గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్ర ఉపరితలంపై పేలిపోయింది.

2 లో

కాళ్లు మొక్కుతారా.. చెప్పులు మోస్తారా?



2 లో

న్యూస్ డెస్క్, నవంబర్ 15 (తెలుగు గళం) తెలంగాణలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నాయకుల ప్రవర్తన పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఢిల్లీ అగ్రనేతల ముందు రాష్ట్ర నాయకులు వ్యవహరిస్తున్న తీరు పదవుల గౌరవాన్ని దిగజార్చేలా ఉందని ఆక్షేపిస్తూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

సజ్జనార్‌పై ఆరోపణలు.. సీఎంకు ఫిర్యాదు!

- సజ్జనార్‌పై రాజాసింగ్ సంచలన లేఖ
- గోల్డ్ చోరీ కేసులో పురోగతి ఏది?
- ఫోన్ ట్యాపింగ్‌లో సజ్జనార్ పాత్రపై ఆరా
- హామ్‌వే కేసుపై స్వతంత్ర విచారణ
- సజ్జనార్ ఆస్తులపై విచారణ జరపాలి
- జ్యూడీషియల్ విచారణకు రాజాసింగ్ డిమాండ్
- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కీలక లేఖ



న్యూస్ డెస్క్ నవంబర్ 15 దీ(తెలుగు గళం): గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పదవీ కాలంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలు, పెండింగ్ కేసులపై స్వతంత్ర సీబీఐ విచారణ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జనార్దన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సజ్జనార్ చేసిన ఇటీవలి ట్వీట్ తర్వాత ఆయన ప్రవర్తన పై పలు ప్రశ్నలు, అనుమానాలు...

2 లో


గ్యారేజ్‌లో అగ్నిబీభత్సం.. ఐదు బస్సులు స్వాహా!



2 లో

- బొరంపేట గ్యారేజ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- పక్కపక్కనే ఉన్న ఐదు బస్సులు పూర్తిగా దగ్ధం
- సమీపంలోని పెట్రోల్ బంక్‌తో స్థానికుల్లో భయాందోళన
- మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసిన సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసుల అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

రాజస్థాన్ పేలుడు వెనుక పాక్ హస్తం!



- పంజాబ్‌లో ఇద్దరి అరెస్ట్
- 'షా' ఆదేశాలతో విధ్వంసానికి ప్లాన్
- రైల్వే ట్రాక్‌పై ఐఈడీ అమరిక
- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- పాక్ ఉగ్ర నెట్‌వర్క్‌పై ఆరా

2 లో

మోదీతో రేవంత్ కీలక భేటీ!

- తెలంగాణకు రూ.30 వేల కోట్ల సాయం
- సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు
- తుమ్మిడిహెట్టికి కేంద్రం సహకారం
- గోదావరి-కావేరి అనుసంధానంపై ప్రతిపాదన
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం
- ఖేలో ఇండియా గేమ్స్‌కు రావాలని ఆహ్వానం
- తెలంగాణ నీటి వాటాపై విజ్ఞప్తి



2 లో

న్యూస్‌డెస్క్, నవంబర్ 15 (తెలుగు గళం)తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఢిల్లీలోని ప్రధాని నివాసం లోక్ కల్యాణ్ మార్గ్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, కేంద్ర నిధుల కేటాయింపు వంటి అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అవసరాలను వివరిస్తూ పలు కీలక వినతులు సమర్పించారు. ముఖ్యంగా రైతులను ఆదుకోవడంతో పాటు కరువు నివారణ చర్యల కోసం కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల తక్షణ ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడి పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీటి అవసరాలపై కరువు ప్రభావం పడుతోందని వివరించారు. రైతులను ఆదుకోవడానికి, కరువు నివారణ చర్యలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణకు అక్వాన్ తుఫాన్ ముప్పు

- ఆరు జిల్లాలకు భారీ వర్ష సూచన
- 20 నుంచి 22 వరకు వర్షాలు
- ఖమ్మం, నల్గొండకు అలర్ట్

2 లో

- తుఫాన్‌తో మారనున్న వాతావరణం
- రైతులకు వాతావరణ హెచ్చరికలు
- ధాన్యం కొనుగోళ్లపై తుఫాన్ ప్రభావం

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త బాస్!

- తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి
- మీనాక్షి నటరాజన్‌కు బదులుగా సందీప్ కుమార్
- సందీప్ నియామకానికి ఖర్గే ఆమోదం
- ఉన్నత చదువుల కోసం లండన్‌కు మీనాక్షి
- పార్టీ సంస్థాగత బాధ్యతలు కొత్త ఇన్‌ఛార్జికి
- మహారాష్ట్ర, గుజరాత్‌లో పనిచేసిన అనుభవం
- సందీప్ నియామకంపై మహేశ్ గౌడ్ హర్షం



2 లో

న్యూస్ డెస్క్, నవంబర్ 15 (తెలుగు గళం)తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన ఏఐసీసీ కార్యదర్శి బీఎం సందీప్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన మీనాక్షి నటరాజన్ స్థానంలో ఆయనకు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఉన్నత చదువుల కోసం మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్లడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నియామకానికి ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు సందీప్ కుమార్ చేతుల్లోకి వెళ్లాయి.

తనిష్క్ దోపిడీలో యూట్యూబర్ అరెస్ట్!

- రూ.31 కోట్ల నగల చోరీలో ట్విస్ట్
- దోపిడీ కేసులో మీనాక్షి అరెస్ట్
- పొలంలో పాతిపెట్టిన బంగారం స్వాధీనం
- నిషాంత్ కోసం 9 పోలీసు బృందాల గాలింపు
- స్నేహితురాలి కోసమే భారీ దోపిడీ?

2 లో

- నిందితుడికి తండ్రి సహకారం.. అరెస్ట్
- 6 కిలోల బంగారు, వజ్రాభరణాల రికవరీ

మా డోర్ అల్లా చేతిలో.. మీది బీజేపీ చేతిలో!

- అఖిలేష్‌కు ఒవైసీ ఘాటు కౌంటర్
- బీజేపీ చేతిలో మీ డోర్: ఒవైసీ
- అఖిలేష్ ద్వంద్వ నీతిపై ఒవైసీ ఫైర్
- ఎర్ర టోపీ నేతలపై ఒవైసీ సెటైర్లు
- రాజ్యసభ ఎంపికపై అఖిలేష్‌కు ప్రశ్నలు
- అఖిలేష్‌పై ఒవైసీ విమర్శల దాడి

2 లో

రాజస్థాన్ పేలుడు వెనుక పాక్ హస్తం!

న్యూస్ డెస్క్, నవంబర్ 15(తెలుగు గళం) రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో రైల్వే ట్రాక్‌పై బాంబ్ పేలిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి 21 ఏళ్ల యువతి మహక్‌దీర్ కౌర్, ఆమె సహచరుడు 23 ఏళ్ల దేవేంద్ర సింగ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్ల ప్రేమ సంబంధం కారణంగా యువతి ఈ టెర్రర్ నెట్‌వర్క్‌లో చేరారనే అనుమానంతో దర్యాప్తు చేస్తున్నారు. ఈ పేలుడుకు పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తుల ప్రమేయం, నిధులు, ఇతరుల పాత్రపై భద్రతా సంస్థలు దర్యాప్తు ప్రారంభించాయి.

నవంబర్ 3న శ్రీగంగానగర్ జిల్లాలోని అనూప్‌గఢ్--సూరత్‌గఢ్ రైల్వే మార్గంలో ఈ పేలుడు సంభవించింది. రాజస్థాన్ ఏటీఎస్, శ్రీగంగానగర్ పోలీసులు, పంజాబ్ పోలీసులు ఈ ఘటనపై సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు. పంజాబ్ గురుదాస్‌పూర్‌కు చెందిన మహక్‌దీర్ కౌర్, దేవేంద్ర సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పేలుడులో యువతికి దేవేంద్ర సింగ్ సహకరించినట్లు అనుమానిస్తున్నారు.

ఐఎస్ఐ ఏజెంట్‌తో ప్రేమ..

విచారణలో.. మహక్‌దీర్ కౌర్‌కు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయం ఉన్నట్లు తేలింది. షా, చాచా అనే కోడ్ పేర్లు కలిగినవారితో పరిచయం ఏర్పడిందని, నిందితురాలు వీరితో సంభాషణలు జరిపినట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. ఒక ఐఎస్ఐ ఏజెంట్‌తో మహక్‌దీప్ ప్రేమ సంబంధంలో ఉందని, దీనిని ఆసరాగా చేసుకుని ఆమెను ఈ నెట్‌వర్క్‌లోకి లాగినట్లు అనుమానిస్తున్నారు. ఆమె భర్త ప్రస్తుతం డ్రగ్స్ కేసులోల జైలులో ఉన్నాడు. భర్త నుంచి విడిపోయి ఉంటున్న మహక్‌దీప్ ఒంటరితనాన్ని ఉపయోగించుకుని టార్గెట్ చేసిరా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

గతంలో రాజస్థాన్‌లో గంగాపూర్ సిటీలో జరిగిన మరో కేసులో ఈమెకు సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో బబిత అనే మహిళను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అరెస్ట్ చేసింది. పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తులతో ప్రేమ సంబంధం ద్వారా ఆమె పరిచయం పెంచుకున్నట్లు అప్పట్లో దర్యాప్తు అధికారులు తేల్చారు. ఈ రెండు కేసుల్లో ఒకే తరహా విధానాన్ని టెర్రర్ నెట్‌వర్క్ అమలు చేస్తుందా? అని భద్రతా సంస్థలు విచారణ చేపట్టాయి.

పిస్టళ్లు, తూటాలు స్వాధీనం..

మహక్‌దీప్ కౌర్ వద్ద నుంచి రెండు విదేశీ పిస్టళ్లు, 46 లైవ్ కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రాజస్థాన్ ఏటీఎస్ వెల్లడించింది. అలాగే రూ.30 వేల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ట్రాక్‌పై పేలుడు ఆపరేషన్ నిర్వహించేందుకు ఈ డబ్బు ఇచ్చి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

మోదీతో రేవంత్ కీలక భేటీ!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని కోరినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన కేంద్ర అనుమతులు, నిధులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇప్పించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) వచ్చేలా సహకరించాలని కోరారు. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.


గోదావరి-కావేరి నదుల అనుసంధానం అంశం కూడా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ అనుసంధానం ద్వారా తరలించే నీటిలో తెలంగాణకు 50 శాతం వాటా కేటాయించాలని కోరినట్లు సమాచారం. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా కేంద్రం సహకరించాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న అంతర్రాష్ట్ర సమస్యలను ప్రధానికి ముఖ్యమంత్రి, మంత్రులు వివరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తెలంగాణలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించనున్నారు. అదే సమయంలో డిసెంబర్ 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని కూడా ప్రధాని మోదీని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధికి ఈ పోటీలు దోహదపడతాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

ప్రధాని మోదీతో సమావేశం తర్వాత కూడా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకం బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ లాయర్ సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌లో కూడా పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలతోనూ సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

తనిష్క్ దోపిడీలో యూట్యూబర్ అరెస్ట్!



న్యూస్ డెస్క్, నవంబర్ 15 (తెలుగు గళం) తమిళనాడులోని మదురై లో ఇటీవల కొత్తగా ప్రారంభమైన తనిష్క్ జ్యువెలరీ షోరూమ్‌లో జరిగిన భారీ దోపిడీ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రముఖ యూట్యూబర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ మీనాక్షి (మీనాక్షి నాచియార్)తో పాటు ప్రధాన నిందితుడు నిషాంత్ తండ్రి సురేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు మదకుళం చెరువు సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గోనె సంచుల్లో పాతిపెట్టిన సుమారు 5 నుంచి 6 కిలోల బంగారు, వజ్రాభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, యూట్యూబర్ నిషాంత్ కోసం 9 ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు

మదురై బైపాస్ రోడ్డులోని పలంగనాథం వద్ద కొత్తగా తెరిచిన తనిష్క్ షోరూమ్‌లో నవంబర్ 12 తెల్లవారుజామున ఈ భారీ దోపిడీ జరిగింది. సుమారు 10 కిలోల బంగారం, ఒక కిలో వజ్రాభరణాలు (మొత్తం విలువ దాదాపు రూ. 25 నుంచి రూ. 31 కోట్ల వరకు ఉంటుందని అంచనా) చోరీకి గురయ్యాయి. ప్రధాన నిందితుడు నిషాంత్ దోపిడీకి ముందు మూడుసార్లు కస్టమర్ వేషంలో షోరూమ్‌కు వచ్చి రెక్కీ నిర్వహించినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. షోరూమ్‌కు ఇంకా పూర్తిస్థాయి లాకర్ సదుపాయం లేకపోవడం, రాత్రివేళ యాంటీ-బర్గ్లరీ అలారం ఆన్ చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నిషాంత్ భవనం వెనుక ఉన్న స్కాఫోల్డింగ్ సాయంతో టెర్రస్ మీదుగా లిఫ్ట్ షాఫ్ట్ ద్వారా లోపలికి ప్రవేశించి నగలు ఎత్తుకెళ్లాడు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన స్నేహితురాలు మీనాక్షి కోసమే నిషాంత్ ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ తర్వాత కొంత బంగారాన్ని మదకుళం సమీపంలోని పొలంలో పాతిపెట్టి, మరికొంత బంగారంతో నిషాంత్ పరారయ్యాడు. దోపిడీ సమయంలో ధరించిన దుస్తులను తగలబెట్టి సాక్ష్యాలను మాయం చేయడంలో నిషాంత్ తండ్రి సురేశ్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఆటోరిక్షా ప్రయాణం, పశువుల కాపరి ఇచ్చిన సమాచారం, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు మీనాక్షి, సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరచగా, నవంబర్ 29 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిషాంత్ చివరి లొకేషన్ తిరుప్పూర్‌లో ట్రేస్ అయిందని, అతడిని పట్టుకుంటే మిగిలిన నగలు కూడా రికవరీ అవుతాయని మదురై పోలీస్ కమిషనర్ ఎస్. రాజేంద్రన్ తెలిపారు.

తెలంగాణకు అక్వాన్ తుఫాన్ ముప్పు



న్యూస్ డెస్క్, నవంబర్ 15(తెలుగు గళం) బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుఫాను కారణంగా తెలుగు రాష్ట్రాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను ప్రభావంతో ఈ నెల 20వ తేదీన ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో వాతావరణం పూర్తిగా మారిపోయి వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ముఖ్యంగా ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని తూర్పు మరియు దక్షిణ జిల్లాలలో వాతావరణం మారుతుందని, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ అలాగే నాగర్ కర్నూల్ జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు వెలువడ్డాయి. ఇదే విధంగా ఈ నెల 21, 22 తేదీలలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో కూడా తుఫాను ప్రభావం కొంతవరకు కనిపించే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాలలో ఆకాశం మేఘావృతమై ఉండి కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో, ఈ తుఫాను రాకతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్రంలో వరి కోతలు, ధాన్యం కొనుగోళ్ల దశ కొనసాగుతున్నందున, ఈ వర్ష సూచన నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అకస్మాత్తుగా మారే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగు ముందస్తు రక్షణ చర్యలు పాటించడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

మా డోర్ అల్లా చేతిలో.. మీది బీజేపీ చేతిలో!



న్యూస్ డెస్క్, నవంబర్ 15 (తెలుగు గళం)త్వరలో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీపై అఖిలేష్ యాదవ్ చేసిన 'గాలిపటం డోర్' వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఎంఐఎంను ఉద్దేశించి గతంలో అఖిలేష్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "'డోర్ (దారం) ఎంతవరకు వదిలితే వారు అంతవరకే ఎగురుతారు.. మేము డోర్ లాగినప్పుడు కిందకు దిగాల్సిందే' అని అఖిలేష్ అన్నారు. అఖిలేష్ యాదవ్ గారూ.. మా 'డోర్', మా తలరాత అల్లా చేతిలో ఉందని ముస్లింలు నమ్ముతారు. మీరు తీవ్రమైన భ్రమలో ఉన్నారు మిత్రమా.. నిజానికి మీ 'డోర్' మాత్రం బీజేపీ చేతిలో ఉంది" అని అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు.

రాజ్యసభ ఎంపీ నియామకంపై నిలదీత

అఖిలేష్ యాదవ్ రాజకీయ ద్వంద్వ నీతిని ఎండగడుతూ ఒవైసీ పలు ప్రశ్నలు సంధించారు. "అఖిలేష్ యాదవ్ ఎవరిని రాజ్యసభ ఎంపీగా నియమించారు? జార్ఖండ్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి అభ్యర్థిని ఓడించిన వ్యక్తి కుమారుడిని ఆయన ఎంపిక చేశారు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉంటూ, బీజేపీ మద్దతుదారుగా ఉన్న వ్యక్తి కుమారుడిని అఖిలేష్ సాదరంగా ఆహ్వానించి పదవి ఇచ్చారు" అని ఒవైసీ ఆరోపించారు.

'ఎర్ర టోపీ'పై వ్యంగ్యాస్త్రాలు

తమ పార్టీపై మీడియా చూపే వైఖరిని కూడా ఒవైసీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మా పార్టీలోని ఒక సాధారణ కార్యకర్త తండ్రికి బీజేపీతో సంబంధం ఉండి ఉంటే, పొద్దున్న నుంచి రాత్రి వరకు మీడియా మొత్తం మమ్మల్ని వెంటాడేది. నిజం చెప్పాలంటే, నా సొంత మామగారు కూడా నాపై అంత 'ప్రేమ' చూపించరు, కానీ మీడియా నాపై అంత ప్రేమ కురిపిస్తుంది. మరి ఇప్పుడు ఆ 'ఎర్ర టోపీ' (సమాజ్‌వాదీ పార్టీ) నేతలను అడగండి.. బీజేపీ మద్దతుదారుల కుటుంబాలతో ఇదేం ప్రేమ? ఈ బంధం ఏమిటి?" అంటూ మీడియాపై, అఖిలేష్ యాదవ్‌పై అసదుద్దీన్ ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

గ్యారేజ్‌లో అగ్నిబీభత్సం.. ఐదు బస్సులు స్వాహా!

న్యూస్ డెస్క్, నవంబర్ 15(తెలుగు గళం) దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బౌరంపేట బొడ్రాయి సమీపంలోని ఒక గ్యారేజ్‌లో పార్క్ చేసి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మొత్తం ఐదు బస్సులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. గ్యారేజ్‌లో బస్సులన్నీ పక్కపక్కనే పార్క్ చేసి ఉండటంతో మంటలు ఒకదానికొకటి వేగంగా వ్యాపించాయి. ప్రమాద స్థలానికి అతి సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని చుట్టుపక్కల ప్రజలు బెంబేలెత్తిపోయారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గ్యారేజ్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్లే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త బాస్!

మొదటి పేజీ తరువాయి

మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ 2025 ఫిబ్రవరి 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. అయితే, ఈ ఏడాది జూన్‌లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేయగా.. తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను వెల్లడించలేదన్న కారణంతో రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ పరిణామాల అనంతరం ఆమె పార్టీ బాధ్యతల నుంచి విరామం తీసుకున్నారు. క్లైమేట్ ఛేంజ్ అండ్ సస్టైనబుల్ పాలసీ అంశంపై యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో కోర్సు చేసేందుకు సెప్టెంబరు 15న లండన్‌కు వెళ్లారు. అప్పటి నుంచి తెలంగాణకు కొత్త ఇన్‌ఛార్జిని నియమిస్తారనే ప్రచారం మొదలైంది. ఈ పదవి కోసం పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. చివరకు అనూహ్యంగా బీఎం సందీప్‌కు మార్‌కు అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది.

తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా 2023 నుంచి ఇప్పటివరకు నలుగురు నేతలు బాధ్యతలు నిర్వహించారు. 2023 జనవరి నుంచి అదే ఏడాది డిసెంబరు వరకు మహారాష్ట్రకు చెందిన మాణిక్‌రావ్ ఠాక్రే ఈ పదవిలో ఉన్నారు. అనంతరం పశ్చిమబెంగాల్‌కు చెందిన దీపాదాస్‌మున్షీ 2025 ఫిబ్రవరి వరకు బాధ్యతలు చూశారు. ఆమె తర్వాత మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. తాజాగా సందీప్ కుమార్‌కు అవకాశం దక్కింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వానికి-పార్టీకి మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సంబంధాలు వంటి అంశాలను కొత్త ఇన్‌ఛార్జి పర్యవేక్షించనున్నారు.

ఎవరీ బీఎం సందీప్‌కుమార్?

కర్ణాటకలోని చిక్కమగళూరు సందీప్‌కుమార్ స్వస్థలం. కాంగ్రెస్ పార్టీలో వివిధ సంస్థాగత బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేసిన అనుభవం ఉంది. గతంలో మహారాష్ట్ర, గుజరాత్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కర్ణాటక విభాగం ఛైర్మన్‌గా, ఆ సంస్థ జాతీయ కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఈ అనుభవంతో తెలంగాణలో పార్టీ వ్యవహారాలను ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జిగా నియమితులైన బీఎం సందీప్ కుమార్‌కు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

స్టార్‌షిప్ ప్రయోగం పాక్షిక విజయం

మొదటి పేజీ తరువాయి

ఈ ల్యాండింగ్ విఫలమవడానికి గల ఖచ్చితమైన కారణాలు వెంటనే తెలియరాలేదని స్పేస్‌ఎక్స్ ప్రతినిధి డాన్ హుయోట్ వెల్లడించారు. బూస్టర్ పేలిపోయినప్పటికీ, రాకెట్ పై భాగమైన స్టార్‌షిప్ అంతరిక్ష నౌక ప్రస్తుతం కక్ష్యలో సురక్షితంగా కొనసాగుతోంది. ప్రణాళిక ప్రకారం, అంతరిక్ష నౌక శనివారం(భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2:50 గంటలకు) భూమికి తిరిగి రానుండగా, లాంచ్ ప్యాడ్‌పై ఉన్న భారీ మెకానికల్ ఆర్మ్ ద్వారా గాల్లోనే ఒడిసిపట్టుకునేందుకు స్పేస్‌ఎక్స్ సిద్ధమైంది. భూమికి తిరిగి వస్తున్న ఒక అంతరిక్ష నౌకను ఇలా పట్టుకోవడానికి ప్రయత్నించడం చరిత్రలో ఇదే మొదటిసారి. గత 14 ప్రయోగాల్లో పై దశ నౌకలన్నీ సాంకేతిక లోపాల వల్ల సముద్రంలోనే కూలిపోగా, ఈసారి దానిని సురక్షితంగా వెనక్కి రప్పించి భవిష్యత్తు ప్రయోగాలకు మళ్లీ వాడుకోవాలని సంస్థ ఆశిస్తోంది.

2028 నాటికి చంద్రునిపైకి లక్ష్యం

అంతరిక్ష ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గించాలంటే రాకెట్‌లోని రెండు భాగాలను (బూస్టర్, అప్పర్ స్టేజ్) పూర్తిగా పునర్వినియోగించుకోవడం స్పేస్‌ఎక్స్‌కు అత్యంత కీలకం. ప్రస్తుతం వాడుతున్న చిన్న ఫాల్కన్ రాకెట్ల రెండో దశను తిరిగి పొందే అవకాశం లేనందున, భవిష్యత్ అవసరాల కోసం మస్క్ స్టార్‌షిప్‌పైనే భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం నాసా నుండి బిలియన్ల డాలర్ల నిధులు అందగా, స్పేస్‌ఎక్స్ సొంతంగా కనీసం 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.40 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టింది. 2027 ప్రారంభం నాటికి వారానికి ఒక స్టార్‌షిప్ ప్రయోగం నిర్వహించాలని, 2028 నాటికి వ్యోమగాములను చంద్రునిపైకి పంపాలని మస్క్ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, తాజా బూస్టర్ వైఫల్యం వంటి సాంకేతిక సవాళ్లు ఈ షెడ్యూల్‌ను కొంత ఆలస్యం చేసే అవకాశం ఉంది.

కాళ్లు మొక్కుతారా.. చెప్పులు మోస్తారా?

మొదటి పేజీ తరువాయి

అందులో " తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల్లో తమ పదవులకు ఉండాల్సిన హుందాతనం, గౌరవం కరువయ్యాయని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని దిగజార్చేలా వారి ప్రవర్తన ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాహుల్ గాంధీ బైక్ వెంట మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పనివాళ్లలా పరుగులు తీయడం అవమానకరమని వ్యాఖ్యానించారు.

అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాళ్లు మొక్కుతూ, ఆయన చెప్పులు మోసుకెళుతున్న కేంద్ర మంత్రి మరియు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి తీరును కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటు, అవమానకరమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జాతీయ పార్టీల నేతల వ్యవహార శైలి ఉందని, ఆ ఆత్మగౌరవ విలువ ఈ రెండు జాతీయ పార్టీలకు ఎప్పటికీ అర్థం కాదని ఆయన స్పష్టం చేశారు.

సజ్జనార్‌పై ఆరోపణలు.. సీఎంకు ఫిర్యాదు!

మొదటి పేజీ తరువాయి



మరింత బలపడ్డాయని రాజా సింగ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఆయన హయాంలో జరిగిన కొన్ని దర్యాప్తుల పారదర్శకత, నిష్పక్షపాతతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

అలాగే సజ్జనార్ పదవీకాలంలో నమోదైన గోల్డ్ తెఫ్ట్ (బంగారం చోరీ) కేసులో ఎలాంటి గణనీయమైన పురోగతి లేదని, ఇప్పటివరకు అరెస్టులు ఎందుకు జరగలేదని రాజా సింగ్ ప్రశ్నించారు. దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడానికి, వాస్తవాలను తొక్కు పెట్టడానికి ఏవైనా ప్రయత్నాలు జరిగాయా అనేది తేల్చాలని రాజాసింగ్ కోరారు. అలాగే ఆయన హయాంలో నమోదైన హామ్‌వే కేసులో కూడా తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, దర్యాప్తులో ఆశించిన పురోగతి లేదని లేఖలో ఎత్తిచూపారు.

ఈ కేసు విచారణలో జాప్యానికి గల కారణాలను స్వతంత్రంగా పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం దర్యాప్తు దారి మళ్లిందనే తీవ్ర ఆందోళనలు ఉన్నాయని రాజా సింగ్ పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరోపణలు, ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ విచారణ పురోగతిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అప్పటి సీపీ సజ్జనార్ పాత్రపై కూడా స్వతంత్ర విచారణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు ఇటీవల సజ్జనార్‌పై తీవ్రమైన బహిరంగ ఆరోపణలు చేశారని, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించిన విషయాన్ని రాజా సింగ్ గుర్తు చేశారు. సజ్జనార్ కర్ణాటకలోని తన స్వగ్రామం, దాని పరిసరాల్లో సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వనరులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎమ్మెల్యే రాజా సింగ్ తన లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

రాహుల్ సభకు జనం కరువు

మొదటి పేజీ తరువాయి

అక్కడేం (గిగ్ వర్కర్ల సభ) జనాలు ఉన్నరు.. అంటూ తన అసంతృప్తిని బహిరంగంగానే వెల్లడించారు. జాతీయ స్థాయి నేత వచ్చినప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాల

జనగామ ఏటీసీ నిర్మాణానికి అనువైన స్థలం కేటాయించాలి

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లుకు నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి విజ్ఞప్తి



జనగామ నవంబర్ 15(తెలుగు గళం) జనగామ నియోజకవర్గానికి మంజూరైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లును నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి కోరారు. ఈ విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.జనగామ మండలం చంపకహిల్స్ పరిధిలోని సర్వే నంబర్ 140/1లో ఐటీఐ కళాశాల కోసం ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, అందులో రెండు ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. అయితే ప్రతిపాదిత స్థలం పక్కనే ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళ్తుండటంతో అక్కడ ఏటీసీ నిర్మాణం, విద్యార్థుల భద్రతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు.ఈ నేపథ్యంలో గతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు అప్పగించిన రెండు ఎకరాల స్థలానికి బదులుగా మరో అనువైన స్థలాన్ని కేటాయించాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.ఏటీసీ మంజూరై ఏడాది గడుస్తున్నప్పటికీ జనగామ నియోజకవర్గంలో ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు.ఇతర నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జనగామలోనూ త్వరగా పనులు మొదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఏటీసీ అందుబాటులోకి వస్తే స్థానికంగా ఉన్న నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్య శిక్షణ లభిస్తుందని తెలిపారు.శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.జనగామ ప్రాంత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హైటెన్షన్ విద్యుత్ తీగలు లేని సురక్షితమైన మరో స్థలాన్ని త్వరగా కేటాయించి, ఏటీసీ నిర్మాణ పనులు ప్రారంభించాలని బిర్రు ఇస్తారి ప్రభుత్వానికి హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

విద్యార్థిని ధ్రువపత్రాల్లో తప్పులు సరిదిద్దకుండా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం

40 రోజులుగా పాఠశాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం.. అధికారులకు తల్లిదండ్రుల విజ్ఞప్తి



సత్తుపల్లి/వేంసూరు, నవంబర్ 15 (తెలుగుగళం) న్యూస్: విద్యార్థిని పాఠశాల ధ్రువపత్రాల్లో నమోదైన తప్పులను సరిచేయకుండా న్యూ సాంగ్ పాఠశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన పిల్లి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె సిరివెన్నెల రెండేళ్ల క్రితం న్యూ సాంగ్ పాఠశాలలో ఒకటి, రెండో తరగతి చదివిందని, అనంతరం గురుకుల ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి పాల్వంచలో సీటు పొందిందని తెలిపారు.

అయితే గతంలో చదివిన పాఠశాల ధ్రువపత్రాల్లో పుట్టిన తేదీ తప్పుగా నమోదు చేయడంతో పాటు, ఇంటిపేరు పిల్లి బదులు పూరేటిగా రాశారని ఆరోపించారు. ఈ తప్పులను సరిచేయాలని గత 40 రోజులుగా పాఠశాల చుట్టూ తిరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ప్రిన్సిపాల్ విదేశాలకు వెళ్లారని, వచ్చే వరకు వేచి చూడాలని, లేదంటే తాము సూచించిన ఫీజు చెల్లించి అదే పాఠశాలలో చదవాలని షరతులు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ధ్రువపత్రాల్లో తప్పులను సరిచేయించడంతో పాటు, పాఠశాల యాజమాన్యంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



తెలుగుగళం న్యూస్, అనంతపురం జిల్లా తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 120మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వెత్త సంఘసేవకుడు బొంబాయి రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షనతో కఠోరమైన సాధన చెసి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తైక్వాండో క్రీడ వల్ల చాలా ఉపయోగాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం పోటీలను ప్రారంభించారు.జిల్లా తైక్వాండో అసోషియేషన్ అధ్యక్షులు కె. శాంతరాజ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మొదటి రెండవ స్థానాలను సాధించిన క్రీడాకారులని ఈ నెల 23వ తేదీన జరిగిబోయే రాయలసీమ స్థాయి పోటీలకి ఎంపిక చేస్తామని అన్నారు.ఈ పోటీలకి ముఖ్య సాంకేతిక నిపుణులుగా ఛాంపియన్స్ తైక్వాండో అకాడమీ రామాంజినేయులు వ్యవరించారు. ఈ పోటీల అనంతరం ముగింపు కార్యక్రమనికి జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారిణి మంజుల హాజరైయి విజేతలకు పతకాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో కార్యదర్శి తులసి రామ్ మరియు సత్యసాయి జిల్లా కార్యదర్శి రామాంజినేయులు శిక్షకులు బి.రాజేష్ మరియు స్వేరోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి. తిరుమల్లయ్య రాస్ బయో ఫార్మ్ ఎండీ. రామచంద్ర హెగ్డే వెంకటనాయుడు బాబు నాయుడు రామ మోహన్ రెడ్డి ప్రేమ్ కుమార్ రాగే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే

- కళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు



తెలుగుగళం న్యూస్ పామిడి,నవంబర్ 15 పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 47 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు డాక్టర్ శరణ్య మాట్లాడుతూ కళ్ళు శరీరంలో అత్యంత సున్నితమైన అవయవాలని వాటి సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాక్టీరియా వైరస్ ఫంగస్ వంటి సూక్ష్మక్రిముల బారిన పడకుండా కళ్ళను కాపాడుకోవాలని తద్వారా అంధత్వాన్ని నివారించవచ్చని తెలిపారు.అనంతరం పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ జయరాం రావు మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత విలువైన బహుమతి అని అన్నారు.కంటి చూపు బాగుంటేనే ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలమని ఇతరులపై ఆధారపడకుండా ఎవరి పనులు వారు సొంతంగా చేసుకోగలరని పేర్కొన్నారు. శిబిరానికి విచ్చేసిన వారందరికీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్మర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్ ఢ పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారతదేశ కార్యదర్శి ఆవుల ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పట్రా నరేష్ కుమార్ డైరెక్టర్లు పట్ర రాకేష్ అంజి నాయక్ నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ శంకర ఆసుపత్రి మరియు లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

చింతనెక్కొండలో అభివృద్ధికి శ్రీకారం–అర్హులకు చేయూత పింఛన్లు





తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /నవంబర్ 15 వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంచింతనెక్కొండ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లతో భరోసా కల్పిస్తున్నాం.ఎంపీ కడియం కావ్యమాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి రోడ్లు కీలకం. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ..ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, కల్లెడ పాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు,మండల గ్రామ సర్పంచ్ జి రమేష్ యాదవ్, అధ్యక్షురాలు సావిత్రి,మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్,పర్వతగిరి మండల సర్పంచులు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,అధికారులు, గ్రామస్తులు తదితరులు. పాల్గొన్నారు.

అత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన పర్వతగిరి పోలీసులు



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/నవంబర్ 15 వరంగల్ జిల్లా:పర్వతగిరి:చామల తండా గ్రామానికి చెందిన గుగులోతు సురేష్ వ్యక్తిగత కారణాలతో క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న అతని అన్న 112 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు.బీట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అతని ఆచూకీ కనుగొన్నారు.అపస్మారక స్థితిలో పడి ఉన్న సురేష్‌ను గుర్తించి, బంధువు బాణావత్ వెంకన్నను పిలిపించి 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉంది. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను ఉన్నతాధికారులు,గ్రామస్తులు అభినందించారు.

42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి – జబ్బ రవి

ఉద్యోగుల సహనానికి పరీక్ష పెట్టొద్దు.. హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం!




తెలుగు గళం ములుగు, నవంబర్ 15: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల త్యాగాలు, పోరాటాలను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ స్టేట్ ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జబ్బ రవి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెన్‌డౌన్, చాక్‌డౌన్‌తో పాటు సకల జనుల సమ్మెలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులకు న్యాయంగా అందాల్సిన రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) అమలులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేయడం విచారకరమన్నారు. ఇప్పటికే 40 నెలలు గడిచినా పీఆర్సీ నివేదిక ప్రభుత్వానికి అందకపోవడం ఉద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని ల42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలనిల డిమాండ్ చేశారు.


గిరిజనే వీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం -- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ఆదివాసీ చరిత్ర, సంస్కృతి పరిరక్షణ మనందరి బాధ్యత

ఘనంగా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి.. జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు



తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 15: గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు, చరిత్రను భావితరాలకు తెలియజేయాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పిలుపునిచ్చారు. భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి, జనజాతీయ గౌరవ దివస్‌ను పురస్కరించుకుని ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం గద్చిరోలిలో నిర్వహించిన జాతీయ స్థాయి వేడుకలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చి ఉల్గులాన్ ఉద్యమానికి నాయకత్వం వహించిన బిర్సా ముండా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గిరిజన విద్యార్థులు విద్యతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ జి. ప్రతాప్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ. అనిల్ కుమార్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ డి. జనార్ధన్, ఇతర అధికారులు, ఐటీడీఏ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గిరిజన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు యువత కృషి చేయాలి

జనజాతీయ గౌరవ దివస్ వేడుకల్లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



తెలుగు గళం, ములుగు, నవంబర్ 15: భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి, జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలోని గిరిజన బాలుర క్రీడా పాఠశాలలో ప్రత్యేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు విద్యతో పాటు తమ మూలాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పూర్వీకుల పోరాట స్ఫూర్తిని తెలుసుకుంటూ, మాతృభాష, పండుగలు, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచీకరణ ప్రభావంతో గిరిజన సంస్కృతి కనుమరుగుకాకుండా యువత దాని పరిరక్షణకు కృషి చేయాలని, మన వారసత్వాన్ని భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. నేటి కాలంలో జ్ఞానమే నిజమైన శక్తి అని, విద్యార్థులు చదువుతో పాటు ప్రశ్నించే తత్వాన్ని, తెలుసుకునే ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక
ఎంఎస్ఎఫ్ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/నవంబర్ 15 వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండ కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కొత్తపల్లి గ్రామంలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు బీసుపాక స్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు చాడ కర్ణాకర్ మాదిగ, మండల ఎంఎస్పీ అధ్యక్షులు ముత్యాల మల్లేశం మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి మాదిగ విద్యార్థి ఎంఎస్ఎఫ్ జెండాను గర్వంగా చేతబట్టి, ఎంఆర్పీఎస్ సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను సంపూర్ణంగా అందిపుచ్చుకోవాలన్నారు. ఎంఎస్ఎఫ్ ఆశయాలను గ్రామ గ్రామానికి, పాఠశాల, కళాశాలలకు తీసుకెళ్లాలన్నారు. ఎంఎస్ఎఫ్ జెండా కేవలం జెండా కాదని, అది విద్యార్థుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి, హక్కుల పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యా హక్కుల కోసం గొంతెత్తి సామాజిక మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నూతన గ్రామ కమిటీ:అధ్యక్షులు బీసుపాక రంజిత్ మాదిగ అధికార ప్రతినిధి –బీసుపాక నాగరాజు మాదిగ ఉపాధ్యక్షులు – బీసుపాక దిలీప్ మాదిగ ప్రధాన కార్యదర్శి–బీసుపాక తేజ మాదిగ

కార్యవర్గ సభ్యులు:బీసుపాక దేవరాజ్ మాదిగ,బీసుపాక దేవేందర్ మాదిగ,తుళ్ల రాహుల్ మాదిగ,తుళ్ల రణధీర్ మాదిగ,తుళ్ల అన్వేష్ మాదిగ,కొండటి తమాస్ మాదిగ, కొండటి ప్రశాంత్ మాదిగ, బీసుపాక రాజు మాదిగ, కందిక ధనుష్ మాదిగ,జన్ను ప్రణయ్ మాదిగ,తుళ్ల సృజన్ మాదిగ,కుల పెద్దలు కొండటి వీరమ్మ తదితరులు.పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు జరిగిన అన్యాయంపై గర్జించిన నేతకాని సమాజం.. హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదు!
లక్ష్మణ్ బాబు చొరవ.. సర్పంచ్ శ్రీలత సహకారం.. హైదరాబాద్‌లో 'హలో నేతకాని - ఛలో ఉస్మానియా' సభకు ములుగు జిల్లా నేతకానీల భారీ తరలింపు!
లి నేతకానీల హక్కుల కోసం ఉస్మానియా వేదికగా సమరశంఖం.. 2 శాతం ప్రత్యేక రిజర్వేషన్‌తో పాటు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్!





తెలుగు గళం ములుగు, నవంబర్ 15: ఎస్సీ వర్గీకరణలో నేతకాని సమాజానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, రాజ్యాంగబద్ధ హక్కుల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన లి'హలో నేతకాని -- ఛలో ఉస్మానియా'లి పోరుబాట సభలో ములుగు జిల్లా నేతకాని నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రత్యేక చొరవతో, ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత సహకారంతో జిల్లా నుంచి నేతకాని కులస్తులు హైదరాబాద్‌కు తరలివెళ్లి సభలో పాల్గొన్నారు. నేతకాని కులసంఘాలు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రోగ్రాం చైర్మన్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, కన్వీనర్ సాయిని ప్రసాద్ నేత నేతృత్వంలో నిర్వహించిన ఈ సభలో నేతకాని సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, ఆర్థిక సమస్యలపై నాయకులు గళమెత్తారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో నేతకాని సమాజానికి న్యాయమైన వాటా కల్పించాలని, తక్షణమే ప్రత్యేక గ్రూపుగా గుర్తించి విద్య, ఉద్యోగ రంగాల్లో 2 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 20 శాతానికి పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే నేతకాని సమాజ అభివృద్ధి కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి రుణాలు, విద్యా, వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతకాని సమాజానికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామని, తమ రాజ్యాంగబద్ధ హక్కులను సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కావిరి చిన్ని కృష్ణ, జాడి భోజరావు, సునారికాని ఐలయ్య, దుర్గం కొమరయ్య, కొండాయి చిన్ని, దుర్గం దుర్గారావు, గోగు కొమరయ్య, కొండగొర్ల రాంబాబు, దుర్గం శ్రావణ్, కొండగొర్ల బాలకృష్ణ, కుమ్మరి రవి, జాడి హరిబాబు, కొండాయి వెంకన్న, జనగం లక్ష్మయ్య, జాడి సమ్మయ్య తదితర నేతకాని నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు ఏకగ్రీవం!
చల్వాక, అల్లవారి ఘణపురం, బానాజిబంధం, ఎలిశెట్టిపల్లిలో నూతన కమిటీల ఎన్నిక
గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం..
ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలి:- మండల అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్



తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 15: ఏటూరునాగారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో మరింత వేగం పెరిగింది. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండల అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చల్వాక, అల్లవారి ఘణపురం, బానాజిబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ కమిటీలే పార్టీకి బలమైన పునాదులని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడంలో నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు, యువత సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతని పేర్కొన్నారు.

లినూతన గ్రామ కమిటీ అధ్యక్షులు:
- ఎలిశెట్టిపల్లి -- పులిసే నరేష్
- బానాజిబంధం -- ఆలం నాగరాజు
- అల్లవారి ఘనపురం -- అల్లంల సమ్మయ్య
- చల్వాక -- చాట్ల వేణుగోపాల్

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రాష్ట్ర డైరెక్టర్ వసంత శ్రీనివాస్, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా, మండల నాయకులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిసెంబర్ 9న హైదరాబాద్‌లో ఆదివాసీల మహాగర్జన..
లక్షలాదిగా తరలిరావాలి!
ఆదివాసీ హక్కుల సాధనకు ఛలో హైదరాబాద్ పిలుపు
బిర్సా ముండా 151వ జయంతి వేడుకల్లో ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం



తెలుగు గళం మంగపేట, నవంబర్ 15: డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆదివాసీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ ములుగు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆదివాసీ పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి వీరతిలకం దిద్ది, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన సాధన కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు నల్లబోన లక్ష్మణరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తోలెం రామకృష్ణ, కొమరం రవి, ఎట్టి సారయ్య, బడిశా నాగరమేష్, తాటి నాగరాజు, చంద రమేష్, కొమరం శివాజీ, సోలం వెంకటేష్, పోలబోయిన ఆదినారాయణ, మడె సతీష్, పోలెబోయిన నాగార్జునతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు, ఏఎస్‌యూ జిల్లా అధ్యక్షులు, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నకోడేపాకలో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్'

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణే లక్ష్యంగా కొత్తపల్లి గోరి ఎస్సై సాయి త్రిలోక్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చిన్నకోడేపాక గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఇళ్లు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం గ్రామస్థులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తుపదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని,చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన కోసం పార్టీలకతీతంగా అందరూ ఒక్కటవ్వాలి
పాలకుర్తి కేంద్రంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలి - బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగరి మహేందర్



పాలకుర్తి నవంబర్ 15(తెలుగు గళం) నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నియోజకవర్గ కేంద్రమైన పాలకుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగరి మహేందర్ డిమాండ్ చేశారు.ఈ పాఠశాల సాధన కోసం పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొడకండ్ల మండలంలో పాఠశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అక్కడి అధికార పార్టీ నాయకులు తమ పార్టీ సభ్యత్వాలకు, పదవులకు రాజీనామా చేసేందుకు సైతం సిద్ధపడటం వారి పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. అయితే పాలకుర్తి మండల కేంద్రంలో పాఠశాల ఏర్పాటు విషయంలో అధికార పార్టీ నాయకులు ఆశించిన స్థాయిలో స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.పాలకుర్తి కేంద్రంలో పాఠశాల ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలోని అన్ని మండలాల పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, తద్వారా వారు ఉన్నత విద్యను అభ్యసించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, నియోజకవర్గ భవిష్యత్తుతో పాటు విద్యార్థుల విద్యా ప్రగతికి సంబంధించిన ప్రజా ప్రయోజన అంశమని పేర్కొన్నారు. అందువల్ల అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులు, యువకులు, సామాజిక కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు.రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని, అవసరమైతే ఏ పార్టీ గుర్తింపు లేకుండా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఈ పాఠశాల సాధన కోసం ఎవరు ముందుకు వస్తున్నారు? ఎవరు వెనుకడుగు వేస్తున్నారు? అనే విషయాలను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పాలకుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు అయ్యే వరకు భారతీయ జనతా పార్టీ తరఫునైనా, అవసరమైతే అఖిలపక్షం ఆధ్వర్యంలోనైనా పోరాటంలో తాను ముందుంటానని దొంగరి మహేందర్ స్పష్టం చేశారు.

తాళ్లపూసపల్లి, ఉప్పరపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ సమక్షంలో గ్రామ కమిటీ ఏకగ్రీవ తీర్మానం..
ముఖ్యఅతిదులు గా మాజీ జడ్పీటీసీ కదిర సురేందర్, పీసీసీ సభ్యులు దస్రు నాయక్, బండారు దయాకర్ .



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి,పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్,స్థానిక శాసనసభ్యులు డా. మురళీనాయక్,డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీనాయక్ ఆదేశాల మేరకు కేసముద్రం మండల కమిటీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండలం లోని అన్నీ గ్రామాల నూతన కమిటీల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు.కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య అధ్యక్షతన,ఉప్పరపల్లి గ్రామం లో గ్రామపార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు అధ్యక్షతన,మండల పార్టీ అధ్యక్షులు సమ్మిగౌడ్ సమక్షంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల తో కలిసి నూతన గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు.గ్రామం లోని సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు,వార్డ్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకలు అందరూ కలిసికట్టుగా, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి,ఎలాంటి పొటీలకు, భేషజాలకు వెళ్లకుండా మంచి మనస్సుతో, స్నేహాభావం తో సెంట్రల్ లో రాజీవ్ గాంధీ ని ప్రధానమంత్రి ని,మళ్ళీ రెండవ సారి కాంగ్రెస్ పార్టీ నీ,రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఏర్పాటు లో మనమంతా భాగస్వాములు కావాలనే అంకిత భావం తో అందరూ కలిసికట్టుగా ఏకగ్రీవ తీర్మానం చేసి తాళ్లపూసపల్లి "గ్రామ పార్టీ అధ్యక్షులు గా కాలేరు వెంకన్న ను,ప్రధాన కార్యదర్శిగా గౌండ్ల లక్ష్మణ్,ఉపాధ్యాక్షులుగా శీలం యాకన్న,కోశాధికారిగా నరేటి సుధాకర్ లను, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉప్పరపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు గా శాగంటి రాములు,ప్రధానకార్యదర్శి గా తండ సంపత్ కుమార్, కోశాధికారిగా ముదురుకోళ్ల రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే యువజన విభాగం నుండి గ్రామ యువజన అధ్యక్షులు గా వల్లాల రాజేందర్,ఉపాధ్యక్షులుగా గోండాల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సమ్మెట వెంకన్న, కోశాధికారి కాలేరు హరీష్, కార్యదర్శి గా కొమిరే ప్రశాంత్ లను గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు సమ్మిగౌడ్ మరియు కదిర సురేందర్,గుగులోత్ దస్రు నాయక్,దయాకర్ బండారు లు మాట్లాడుతూ అధికారం లో పార్టీ లేనప్పుడు 10 సంవత్సరాలు, ఇప్పుడు 3 సంవత్సరాల నుండి ఎన్నో కష్ట, నష్టాలకు ఓర్చుకొని గ్రామ పార్టీ నీ తమ కుటుంబంగా భావించి మానుకోట శాసనసభ్యులు మురళీనాయక్,ఎంపీ బలరాం నాయక్ గెలుపులో ప్రధాన భాగస్వాములు అయినటువంటి మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య నీ,వారి గ్రామ కమిటీ మొత్తాన్ని, కాంగ్రెస్ పార్టీ కుటుంబాన్ని పేరు పేరు నా అభినందించి, శాలువాల తో సన్మానించారు...

మళ్ళీ కొత్తతరానికి కూడా అవకాశం ఇవాలనే ఒక మంచి ఉదేశ్యం తో నూతన కమిటీ ఏర్పాటులో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మొత్తం ఒక్కమాట మీద ఉండి ఏకగ్రీవ తీర్మానం తో కమిటీ నీ బలపరచడం అభినందనీయమని,వారి శ్రమను గుర్తించి ,వారి అనుభవాన్ని గుర్తించి మండల కాంగ్రెస్ పార్టీ భాలోపేతానికి అవసరంగా భావిస్తున్నామని, వారికీ మండల కాంగ్రెస్ పార్టీ లో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.నూతన గ్రామపార్టీ కమిటీ సభ్యులకు, మరియు యువజన కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు..అలాగే నూతన కమిటీ సభ్యులు సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకుంటూ, యువకులను, అనుబంధ సంఘాల పెద్దలను కలుపుకొని ఓపికతో,సంయమనము తో సమన్వయం చేసుకుంటూ పార్టీ నీ భలోపేతం చేస్తూ,కాంగ్రెస్ పార్టీ,సీఎం రేవంతన్న ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ,సంక్షేమ పథకాలను సామజిక మాధ్యామల ద్వారా, గ్రామాల్లో రచ్చబండల దగ్గర ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు...ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దస్రు నాయక్,మాజీ జడ్పీటీసీ కదిర సురేందర్,మాజీ సర్పంచ్ బండారు దయాకర్,సర్పంచ్ చీర వీరాస్వామి,మాజీ సర్పంచ్ నాగేల్లి దాసు,మాజీ సర్పంచ్ కదిర ప్రవంతి ప్రకాష్,గంధసిరి వెంకన్న, వార్డ్ సభ్యులు,మాజీ గ్రామ కమిటీ సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం,యువజన నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.